జనం మెచ్చేలా జగనన్న పాలన

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- అన్ని వార్డుల్లో ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'

సీతమ్మధార: జనం మెచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 24వ వార్డు రేసపువానిపాలెం భూలోకమాత దేవాలయంలో ఆయన పూజలు చేసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రేసపువానిపాలెం సచివాలయం(1086139) పరిధిలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి పాదయాత్రగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగనన్న పాలనలో జరుగుతున్న మంచి అడిగి తెలుసుకుని ప్రజాభిప్రాయం సేకరించారు. ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరించారు. అన్ని వార్డుల్లో కార్పొరేటర్లు, పార్టీ వార్డు ఇన్‌చార్జులు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కె.కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జి.వి.రమణి, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, మాజీ కార్పొరేటర్ బాస్కర్ రాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మురళీకృష్ణ, డైరెక్టర్ పాండవ శ్రీను, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

14వ వార్డులో..

జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్ సచివాలయం(1086122) పరిధిలో కార్పొరేటర్ కఠారి అనిల్‌కుమార్‌రాజు ప్రతి కుటుంబాన్ని పలకరించి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారి అనుమతితో ఇంటింలా స్టిక్కర్లు అంటించారు. మాజీ కార్పొరేటర్ అప్పలనరసింహరాజు, లంకా భాస్కర్, బల్ల శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్లు, సుశీల, సత్యనారాయణ, జగన్నాథరెడ్డి, భోగలింగేశ్వరరావు, రాజకుమారి, గృహసారథులు పాల్గొన్నారు.



రేసపువానిపాలెంలో కె.కె.రాజుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

25వ వార్డులో..

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట గణేష్‌నగర్ చిన్న వినాయక గుడి నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. గత, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా వివరించారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలకు సమాధానాలు అడిగి తెలుసుకుని రసీదు ఇచ్చారు. మద్దతు తెలిపిన కుటుంబ యజమాని చేత 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయించారు. అనంతరం వారి అనుమతితో ఇంటికి, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్ అతికించారు. పార్టీ నాయకులు సానబోయిన సురేష్, సారిపిల్లి సంతోష్, పి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

43వ వార్డులో..

జీవీఎంసీ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో నందగిరినగర్‌లోని చెక్కుడురాయి



46వ వార్డులో ప్రజాభిప్రాయం సేకరిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

బిల్డింగ్ వద్ద నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

46వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కస్తూరినగర్ సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించి జగనన్న పాలనపై ప్రజాభిప్రాయం సేకరించారు. సుపరిపాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించాలని ఆయన కోరారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కొల్లాబత్తుల వెంగళరావు, కో ఆప్షన్ సభ్యులు అప్పారావు, బి.గోవింద్, ఎస్.కృష్ణ, వి.శ్రీను, లావణ్య దూది నర్సింగ్‌రావు, కె.రామారావు, ఈశ్వరరావు, దుర్గాభవాని,



43వ వారులో ప్రజా మద్దతు పుస్తకంలో ప్రశ్నలను అడుగుతున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

అన్నపూర్ణ, విజయలక్ష్మి, వరలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

49వ వార్డులో..

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డు పట్టాభిరెడ్డి తోటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ప్రారంభించారు. గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. భట్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, కిషోర్, నాయకులు పాల్గొన్నారు.

50, 51, 53 వార్డుల్లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న పాలన కోసం అడిగి తెలుసుకుని వారి అభిప్రాయాలు సేకరించారు. మండల కన్వీనర్ పైడి కృష్ణారావు మాస్టర్, సచివాలయ కన్వీనర్లు భరణికాన రామారావు, పప్పల సునీత, ఎంవీ రెడ్డి, పాతపట్నం రామ్మోహన్, ఏవీఎస్ రాజు, సనపల రమేష్, కనమటి రఘు, గృహసారథులు టీఎస్ రెడ్డి, సనపల



25వ వార్డు గణేష్‌నగర్‌లో ఇంటి గేటుకు స్టిక్కర్ అతికిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

రవికుమార్ స్వామి, సరస్వతి పాల్గొన్నారు.

- 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ దరి పైడితల్లమ్మ ఆలయం వద్ద కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూజలు చేసి జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఆలయ కమిటీ పూజారి పక్కి సాయికుమార్, డైరెక్టర్లు పైడి శ్రీను, ప్రసూనారెడ్డి, పైడి ప్రతాప్, మెట్ట దమయంతి, కరిమిరెడ్డి శ్యామ్, లత, సారిక, నూకరాజు, పైడిరాజు, గణేష్, వినోద్, అప్పారావు, మోహన్‌రావు, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.
- 53వ వార్డులో కార్పొరేటర్ బర్కత్ అలీ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుజ్జు వెంకటరెడ్డి, సచివాలయ కన్వీనర్లు షేక్ బాబ్జి, ఝాన్సీ, రామారావు, జ్ఞానేష్, హనుమంతు, జయలక్ష్మి, సుజాత, భాను, సుశీలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.



24వ వార్డులో పాదయాత్రగా ఇంటింటికీ వెళ్తున్న కె.కె.రాజు, బాణాల, పద్మారెడ్డి



51వ వార్డులో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



14వ వార్డులో సంక్షేమ పథకాల పత్రం అందిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు



50వ వార్డులో ఓ ఇంటి వద్ద కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, గృహసారథులు, కన్వీనర్లు

క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ నేడు



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పిస్తారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న కె.కె.రాజు, బానాల శ్రీనివాసరావు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అక్కయ్యపాలెం హైవేపై బస్టాప్ వద్ద శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ



రేషన్ కోసం క్యూలో కార్డుదారులు

సీతమ్మధార: జీవీఎంసీ 24 వార్డు నక్కవానిపాలెంలో శుక్రవారం నెలవారీ రేషన్ సరకులు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. నక్కవానిపాలెం రేషన్ డిపోకు సంబంధించి కార్డుదారులకు సరకులు అందజేశారు.

గాదిరాజు ప్యాలెస్‌లో నేడు, రేపు 'వీ ఎక్స్‌పో'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎక్స్‌పో ప్రతినిధులు

సీతమ్మధార: ఈ నెల 8, 9 తేదీల్లో ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో 'వీ ఎక్స్‌పో' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎక్స్‌పో రాష్ట్ర అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో శుక్రవారం ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. చిన్న తరహా వ్యాపారుల నుంచి పెద్ద ఎత్తున వ్యాపారుల వరకు.. చీపురుపుల్ల మొదలుకొని బంగారు ఆభరణాల వరకు అన్ని వస్తువులు ఎక్స్‌పోలో అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ అధ్యక్షుడు పి.అనిల్, కార్యక్రమ చైర్మన్ అమర్‌నాథ్, డాక్టర్ సువర్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతంపేట: అక్కయ్యపాలెం సెక్షన్ నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. నరసింహనగర్ రైతుబజార్, బీఎస్ లేఅవుట్, శాంతిపురం, ఎన్జీజీవోస్ కాలనీ, శంకరమఠం రోడ్, జీవీఎంసీ పంప్ హౌస్, జీవీఎంసీ స్కూల్స్, ఆరోగ్య కేంద్రం, కిన్నెర మెస్, పద్మశ్రీ ఆస్పత్రి, ఫోర్ట్‌టౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కూలిన భారీ వృక్షం

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని భారీ వృక్షం శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో నేలకొరిగింది. ఎంఆర్‌వో ఆఫీస్ దరి 11 కేవీ లైన్ 33/11 కేవీ డబ్ల్యూడబ్ల్యూ హెచ్‌టీ సర్వీస్ డీపీ అండ్ ఎస్ఎస్ 126 విద్యుత్ స్తంభంపై ఒక్కసారిగా చెట్టు కూలడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పక్కనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. అదే సమయంలో పెద్దగా ట్రాఫిక్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ పోల్‌ను తొలగించారు. చెట్టు కొమ్మలు కట్ చేసి తరలించారు. అక్కడ కొత్తగా విద్యుత్ స్తంభం ఏర్పాటు చేస్తున్నారు. జోన్‌-1 ఈఈ సత్యనారాయణ, ఏడీ మహేశ్వరరెడ్డి, ఎస్ఈ మహేంద్రనాథ్, ఏఈ నరేంద్ర తదితర సిబ్బంది పర్యవేక్షించారు.



వృక్షం కూలిన స్థలంలో పరిశీలిస్తున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

అలరించిన కర్ణాటక సంగీత కచేరీ

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం కర్ణాటక సంగీత కచేరీ జరిగింది. గన్నవరపు రిషిత లక్ష్మి అద్భుత గానంతో త్యాగరాజ, రామదాసు, ముత్తుస్వామి దీక్షితులు కీర్తనలు ఆలపించి ఆహూతులను అలరించారు. వాతాపి గణపతిం, సీతమ్మ, మరుగేలరా, ఎవరూర, ఉపచారము, మా జానకి, తెలిసిరామ, పలుకే బంగార, చరణములే, శ్రీరామ నీనామం, ఎంత పనిచేసితివి కీర్తనలు భక్తులను సంగీత సాగరంలో ఓలలాడించాయి.

ఈమెకు ఎస్.కృష్ణప్రియ వయోలిన్‌పై, బి.గిరిధర్‌రెడ్డి మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని రిషితను అభినందించి సత్కరించారు.



కీర్తనలు ఆలపిస్తున్న గాయని రిషిత లక్ష్మి

చిన్నా కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సాయం

కంచరపాలెం: ఇటీవల మృతి చెందిన మెట్రో టీవీ వీడియో జర్నలిస్ట్ బోనుల చిన్నా కుటుంబాన్ని శుక్రవారం ఆర్పీ పేట జీవీఎంసీ హైస్కూల్ 2002 బ్యాచ్‌కు చెందిన టెన్త్ స్నేహితులు పరామర్శించారు. చిన్నా భార్య ప్రియ, కుమారుడు హర్షిత్‌రామ్, తల్లి లక్ష్మమ్మతో మాట్లాడారు. చిన్ననాటి నుంచి కలిసి చదువుకున్న మిత్రుడు చిన్నా తమ మధ్య భౌతికంగా లేకపోవడం ఎంతో బాధాకరమన్నారు. స్నేహితులు సేకరించిన రూ.1.05 లక్షల నగదును చిన్నా కుమారుడి పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి రూ.5 వేల నగదును లక్ష్మమ్మకు అందజేశారు. చిన్నా కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



చిన్నా కుటుంబ సభ్యులతో స్నేహితులు

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

మురళీనగర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లోని పార్కుల్లో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో నడక ప్రాధాన్యాన్ని వివరించారు. సందర్శకులు, వాకర్స్‌కు పలు సూచనలిచ్చారు. అనంతరం ఆరోగ్య అవగాహన ర్యాలీ చేశారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కోశాధికారి సీహెచ్.లక్ష్మి, జి.మహాలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఇ.శిరీష, క్యాబినెట్ సెక్రటరీ సీహెచ్.జ్యోతి, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతాలను జీవీఎంసీలో కలపాలని వినతి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని సింహగిరి కాలనీ, సింగాలమ్మపురం, వరాహగిరి కాలనీ–1, 2, సత్యసాయినగర్, గణేష్‌నగర్ వంటి కొండవాలు ప్రాంతాలను జీవీఎంసీలో కలపాలని ఆయా కాలనీల అధ్యక్షులు, నివాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్స్‌లో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పాల్గొన్న ఆయనను కాలనీల నాయకులు, స్థానిక కార్పొరేటర్ కంపా హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణలతోపాటు కలిసారు. ఈ ప్రాంతాలు 275 సర్వే నంబర్‌లో ఉన్నాయని, భీమిలి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోకి వస్తున్నాయని, ఈ కారణంగా ఈ ప్రాంతాలలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదని వివరించారు. ఇవి దేవస్థానం పరిధిలోకి వస్తున్నందున ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిని దేవస్థానం సిబ్బంది ఎటువంటి మరమ్మతులు, నిర్మాణాలు చేసుకోనివ్వడం లేదని, ఈ సమస్యను పరిష్కరించేలా చూడాలని వైవీ సుబ్బారెడ్డిని కోరారు. సత్యసాయినగర్ కాలనీ అధ్యక్షుడు కారుకొండ రాజు, సింగాలమ్మపురం కాలనీ ప్రెసిడెంట్ చింతల బాబూరావు, సింగంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.



వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కొండవాలు ప్రాంత కాలనీల నాయకులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో గుడ్ ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు



వాక్యసందేశమందిస్తున్న సిస్టర్ షైలాపాల్

తాటిచెట్లపాలెం: లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్ పి.జె.స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే న్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దైవజనురాలు సిస్టర్ షైలాపాల్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మరణించిన రోజును గుడ్ ఫ్రైడేగా ఎందుకు పిలుస్తారో వివరించారు. పవిత్ర బైబిల్ వాక్య సందేశమిచ్చారు. నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున హాజరైన క్రైస్తవులు ఏసుక్రీస్తు శిలువ త్యాగాన్ని భక్తిశ్రద్ధలతో కొనియాడి ప్రార్థించారు. ఈస్టర్(పునరుత్థాన దినం) సందర్భంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక ఆరాధనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ఏసును స్తుతిస్తూ ఆరాధనలు, ర్యాలీ

సీతంపేట: ఏసుక్రీస్తు మరణం, శిలువ వేయడాన్ని స్మరించుకుంటూ గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతంపేట గణేష్‌నగర్‌లోని సీయోను మందిరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పాస్టర్ శివశంకర లాజరస్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. శిలువ వేసిన ఏసుక్రీస్తు చిత్రపటాన్ని ఊరేగించారు. పెద్ద సంఖ్యలో క్రీస్తు ఆరాధకులు ఏసును స్తుతిస్తూ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, అడ్వకేట్ ఎ.రాజకుమార్, విజయ్, ఏసు, కిరణ్, సీయోను మందిరం సభ్యులు పాల్గొన్నారు.



సీతంపేటలో ఏసు చిత్రపటంతో ర్యాలీ చేస్తున్న సీయోను మందిరం సభ్యులు

రోగుల సహాయకుల కోసం షెడ్ల నిర్మాణం

- కేజీహెచ్ గైనిక్ వార్డు వద్ద ఏర్పాటు

మహారాణిపేట: ఉత్తరాంధ్రలో రోగులకు పెద్ద దిక్కుగా ఉన్న కింగ్ జార్జి ఆస్పత్రి ప్రసూతి రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ షెడ్లు నిర్మించారు. రూ. 12 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఈ నిర్మాణం జరిగింది. గతంలో రోగులు ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే వారి సహాయకులు వార్డు బయట ఎండకు ఎండి, వానకు తడిసి వార్డు పడిగాపులు కాసేవారు. ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రోగుల సహాయకుల బాధలు చూసి చలించిపోయారు. సీఎస్ఆర్ నిధులతో వెయిటింగ్ హాలు నిర్మించాలని ఆదేశించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీపీ నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు షెడ్లు నిర్మించారు. సామగ్రి భద్రపరచుకోవడానికి కప్‌బోర్డులు, సెల్‌ఫోన్ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క షెడ్డులో 20 నుంచి 30 మంది వరకు ఉండడానికి వీలుగా నిర్మాణం జరిగింది. అన్ని సదుపాయాలతో నిర్మించిన వెయిటింగ్ హాలును శుక్రవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ ప్రారంభించారు. ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ డి.రాధాకృష్ణ, డాక్టర్ ఎ.పద్మజ, ఏఆర్ఎంవో డాక్టర్ కె.జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో ఆరోగ్యానికి మేలు

మురళీనగర్: తృణధాన్యాలతో తయారు చేసిన ఆహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని గాంధీ విగ్రహం వద్ద వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆకర్షణీయంగా ఉండే తెల్లని పదార్థాలు తింటే ఆరోగ్యానికి హాని చేస్తాయన్నారు. వీలైనంతలో వైట్ రైస్, ఉప్పు, పంచదార ఆహారంలో తగ్గించుకోవాలని సూచించారు. ముఖ్యంగా బీపీ, సుగర్ ఉన్న వారు వీటిని తగ్గించుకోవడంతోపాటు ప్రతి రోజూ వాకింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రభాశర్మ స్వయంగా తయారు చేసిన రాగి సంకటిని వంద మంది వాకర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ కార్యదర్శి రోజారాణి, కోశాధికారి షీలారాణి, ప్రొగ్రాం ఇన్‌చార్జి శిరీషలత, సలహా సంఘం సభ్యురాలు బిందురాణి, పూర్వ కోశాధికారి జయ, కమిటీ సభ్యులు మంగాదేవి, వసుంధర, సురేంద్ర కౌర్ పాల్గొన్నారు.



వాకర్స్‌కు రాగిసంకటి అందిస్తున్న ఉప్పలపాటి శుభ, క్లబ్ సభ్యులు

పక్షుల సంరక్షణ అందరి బాధ్యత

మద్దిలపాలెం: వేసవి తాపం నుంచి పక్షులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, వాటి దాహార్తి తీర్చడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ పిలుపునిచ్చారు. పక్షుల సౌకర్యార్థం తాగునీటి గిన్నెల పంపిణీ కార్యక్రమం మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో శుక్రవారం గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగింది. మావూరి ముఖ్యఅతిథిగా పాల్గొని పలువురికి తాగునీటి గిన్నెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవరణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా పక్షుల జీవనానికి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడికక్కడ పక్షులు దాహార్తిని తీర్చుకోవడానికి అనువుగా తాగునీటి గిన్నెల ఏర్పాటు చేయడానికి గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ముందు రావడం అభినందనీయమన్నారు.

అధ్వానంగా కాలువలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని కాలువల్లో పెద్ద ఎత్తున పూడికలు పేరుకుపోయాయి. పారిశుధ్య అధికారులు పట్టించుకోకపోవడంతో నెలల తరబడి కాలువలను శుభ్రం చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. దోమలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. రేసపువానిపాలెం రామాలయం దరి కాలువలో ప్లాస్టిక్ బటిళ్లు, చెత్తాచెదారం, మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెలువడుతోంది. దుర్గంధం, దోమల వ్యాప్తితో రోగాల బారిన పడుతున్నామని, పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అధ్వానంగా తయారైన కాలువల శుభ్రతకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రేసపువానిపాలెంలో వ్యర్థాలు, మురుగుతో నిండిన కాలువ